# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 03-05-2016**

భారీ నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులయ్యే వారిని పూర్తి స్థాయిలో ఆదుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు అధికారులను కోరారు. భూ నిర్వాసితులకు అందించాల్సిన పరిహారం, రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమయ్యే భూసేకరణ తదితర అంశాలపై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రులు టి.హరీష్ రావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు, అధికారులు మురళీధర్, హరేరామ్, వెంకటేశ్వర్లు, గోవిందరావు, మెదక్ జెసి వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందివ్వడానికి ప్రాజెక్టులు కడతామని, ఎక్కువ ముంపు లేకుండానే రీ డిజైన్ చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ రిజర్వాయర్ల నిర్మాణం కోసం కొంత ముంపు తప్పదని సిఎం అన్నారు. అలాంటి ప్రాంతాల్లో భూ నిర్వాసితులు భూమి పోయి, ఇల్లు పోయి గూడు చెదిరిన పక్షుల్లా తయారవుతారన్నారు. అలాంటి వారికి కొత్త జీవితం ప్రసాదించాలని కోరారు. నిర్వాసితులు కోల్పోయే వ్యవసాయ భూమికి, ఇల్లు-పశువుల కొట్టం – చెట్లు తదితర ఆస్తులకు, కొత్త ఇంటి నిర్మాణానికి, మూడింటి చెక్కులను ఒకేసారి నిర్వాసితులకు అందివ్వాలన్నారు. ఏకమొత్తంలో డబ్బులు ఇవ్వడం వల్ల నిర్వాసితులు తమకిష్టమొచ్చిన రీతిలో, ఇష్టమొచ్చిన ప్రాంతంలో స్థిరపడే అవకాశం కలుగుతుందన్నారు. స్థానికంగా వుండే మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్వాసితులతో మాట్లాడి అవసరమైన భూ సేకరణ పూర్తి చేయాలని కోరారు.

పనులు వేగంగా జరగాలి

-----------------------------

అటు పాలమూరు, ఇటు కాళేశ్వరం ప్రాజెక్టులకు కావాల్సిన అధికార లాంఛనాలు పూర్తి చేసినందున పనుల్లో వేగం పెంచాలని సిఎం కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజి పూర్తయ్యే దాక ఎదురు చూడకుండా, పంప్ హౌజ్ ద్వారా నీరు పంపాలని చెప్పారు. రాబోయే ఏడాదిన్నరలోగానే కాళేశ్వరం నుంచి మిడ్ మానేరు దాకా నీటిని పంపడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. బ్యారేజ్ లు, పంప్ హౌజ్ లు, రిజర్వాయర్లు సమాంతరంగా నిర్మాణం కావాలన్నారు. ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించాలని మంత్రి హరీష్ రావును సిఎం ఆదేశించారు. కరీంనగర్ జిల్లాలో కట్టే రిజర్వాయర్ల భూసేకరణ బాధ్యత తీసుకోవాలని మంత్రి ఈటెల, కలెక్టర్ నీతూప్రసాద్ ను కోరారు.

**సిపిఆర్ఓ టు సిఎం**